SK1 one NEWS HD
సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
RNI APTEL / 2018/76380
# సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 27 | పేజీలు : 08, వెల రూ. 2 రూ/ | శుక్రవారం 17-04-2026

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు

- ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం
- సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు
- డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- 20 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశం


2 లో

## భారత్‌లో తొలిసారి ముంబైలో పట్టాలెక్కనున్న నాన్ - ఏసీ క్లోజ్డ్ డోర్ లోకల్ రైలు

- ప్రమాదాల నివారణ, వేడి నుంచి ఉపశమనం కల్పించడం ప్రధాన లక్ష్యం
- ఏసీ లేకున్నా 'ఫోర్స్డ్ వెంటిలేషన్' సిస్టమ్‌తో కోచ్‌లలో చల్లదనం
- చెన్నై ఐసీఎఫ్‌లో తయారీ.. త్వరలో ముంబై ట్రాక్‌లపై ట్రయల్స్
- సాధారణ ఛార్జీలకే ఏసీ రైలు తరహా భద్రతా ఫీచర్లు

**అమరావతి :** దేశ ఆర్థిక రాజధాని ముంబై లోకల్ రైళ్లలో ప్రయాణించే లక్షలాది మందికి భారతీయ రైల్వే శుభవార్త అందించింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా నాన్-ఏసీ, ఆటోమేటిక్ డోర్లు మూసుకునే సదుపాయం


2 లో




## ఏపీ ఇంటర్ ఫలితాల విడుదల
## 12 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఉత్తీర్ణత!

- ఇంటర్ ఫలితాలను విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- పరీక్షలకు హాజరైన మొత్తం 10.50 లక్షల మంది విద్యార్థులు
- ఫస్టియర్లో 77 శాతం.. సెకండియర్లో 81 శాతం మంది విద్యార్థుల పాస్

## 24ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు



- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- టీఎంసీ దోచుకున్న ప్రతి పైసా తిరిగి వసూలు చేస్తాం
- బంగాల్‌లో ఎన్నికల ర్యాలీలో అమిత్ షా- టీఎంసీ సర్కార్‌పై విమర్శలు

# నీటి భద్రత కోసం 'జలధార'

- 'జలధార' యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలు
- ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచన
- జూన్ చివరి నాటికి వెలిగొండ మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- నేరడి బ్యారేజ్, చింతలపూడి కెనాల్‌కు త్వరలో టెండర్లు
- రాష్ట్రంలో పెరిగిన భూగర్భ జలాలు.. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు చర్యలు



**అమరావతి :** రాష్ట్రంలో నీటి భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన 'జలధార యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుడి, ఎడమ కాలువలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, హోటళ్లు, షాపింగ్ ఏరియాలతో పాటు పోలవరం-పాపికొండలు-భద్రాచలం మార్గంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు.పునరావాస పనులను వేగవంతం చేసి, నిర్వాసితుల తరలింపును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు రూ.27,089 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన పనులకు మరో రూ.5,108 కోట్లు అవసరమని అధికారులు వివరించారు.రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-1 పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి - మిగతా 2 లో

## ఏపీలో 38 లోక్‌సభ 263 అసెంబ్లీ స్థానాలు




- డీలిమిటేషన్‌తో మారనున్న సమీకరణాలు
- నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లపై కేంద్రం దృష్టి
- నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కీలక బిల్లులు
- ఏపీలో 175 నుంచి 263కు పెరగనున్న అసెంబ్లీ స్థానాలు
- 25 నుంచి 38కి చేరనున్న లోక్‌సభ సీట్లు
- 2029 ఎన్నికల నాటికి కొత్త విధానం అమలు లక్ష్యం

**అమరావతి :** దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లులు ఆమోదం పొందితే 2029 సాధారణ ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం సమూలంగా మారనుంది.ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం, ఏపీలో - మిగతా 2 లో

## దక్షిణాదికి అన్యాయం జరిగితే తీవ్ర పోరాటం తప్పదు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక
- నేడు పార్లమెంట్ లో డీలిమిటేషన్ బిల్లు
- దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని సర్వత్ర ఆందోళన
- దక్షిణాదికి అన్యాయం జరిగితే దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమానికి దారి తీస్తుందన్న కేటీఆర్
- దక్షిణాది ప్రజల విషయంలో బుద్ధిగా వ్యవహరించాలని కేంద్రానికి హితవు


2 లో

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన
- పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా
- అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని వ్యాఖ్య
- రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు

- మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై కేసీఆర్ నిర్ణయం ఇదీ
- డీలిమిటేషన్ బిల్లును పరిశీలించాకే నిర్ణయం ఉంటుందని వెల్లడి
- దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని వెల్లడి
- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు



**హైదరాబాద్ :** భారత ప్రభుత్వం నేడు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర - మిగతా 2 లో

# సంపాదకీయం

## మళ్లీ యుద్ధ మేఘాలు!



చరిత్రాత్మకం అన్నారు. ఉన్నతస్థాయి చర్చలన్నారు. దౌత్యం పూర్తి స్థాయిలో పనిచేస్తోందన్నారు. శాంతికి పశ్చిమాసియా చేరువలో ఉందన్నారు. పాకిస్తాన్ రాజధాని ఇస్లామా బాద్‌లో 21 గంటలపాటు కొనసాగిన అమెరికాఇరాన్ ప్రతినిధి బృందాల చర్చలపై ఎప్పటికప్పుడు మీడియాలో వచ్చిన సమాచారం సారాంశమిది. తీరా బయటికొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చర్చలు విఫలమయ్యాయని ప్రకటించి నిష్క్రమించారు. ఆ వెంటనే ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరింపు భాష మొదలైంది. అమెరికా ఏకపక్ష వైఖరివల్ల 47 సంవత్సరాల తర్వాత ఆ రెండు దేశాలమధ్యా నేరుగా సాగిన చర్చలు చివరికిలా నీరుగారాయి. వచ్చేవారం మరోసారి చర్చలుంటాయని చెబుతున్నారు. కానీ అమెరికా వైఖరి మారకపోతే ప్రయోజనం శూన్యం. ట్రంప్ వచ్చాక చర్చల అర్థమే మారిపోయింది. చర్చలంటే ఆయన శాసిస్తే ఎదుటిపక్షం శిరోధార్యంగా స్వీకరించటం తప్ప మరేంకాదు. అసలు ఈ యుద్ధంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న వాన్స్ నాయకత్వాన ప్రతినిధి బృందాన్ని పంపటంలోనే ఆయన నిజాయితీలేమి వెల్లడైంది. ఏ అధికారమూ లేని, సొంతంగా ఎలాంటి చొరవా తీసుకోలేని ఆ అశక్త బృందం చివరకు ఉత్త డొల్లగా మిగిలిపోయింది. ట్రంప్ తీరు 90వ దశకం మొదట్లో సోవియెట్ యూనియన్ కుప్పకూలిననాటి పరిస్థితుల్ని తలపిస్తోంది. అంతవరకూ సోవియెట్ భాగస్వామ్య రాష్ట్రాలుగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కడికక్కడ సమావేశాలు జరగటం, దేశంనుంచి విడిపోతున్నట్టు ప్రకటించటం రివాజై పోయింది. నిజంగా అలా ప్రకటించేవారి బలాబలాలేమిటో, ఆ తీర్మానాలు అమలయ్యే అవకాశం ఉందో లేదో తెలియని స్థితి. ఇలాంటి అనిశ్చితే ఇప్పుడు అమె రికాను ఆవరించింది. నరమేథాన్ని సాగిస్తూ ఘనవిజయాలుగా ప్రకటించుకోవటం, ఇరాన్ నాగరికత ఈ రాత్రితో అంతం కాబోతున్నదని ప్రకటించటం, అంతలోనే చర్చలకు రావాలంటూ బెదిరించటం ట్రంప్ అలవాటు చేసుకున్నారు. ఇజ్రాయెల్‌తోపాటు ఈ యుద్ధానికి లోపాయికారీగా మద్దతిచ్చిన దేశాలన్నీ ఇరాన్‌నుంచి శరపరంపరగా వచ్చి పడుతున్న క్షిపణుల ధాటికి బెంబేలెత్తినా, అక్కడ పెనువిధ్వంసం చోటుచేసుకుంటున్నా ట్రంప్ బడాయి మాటలు ఆగలేదు. ఆయన ప్రకటనలకు భిన్నమైన స్థితిగతులున్నాయని సైనికా ధికారులే మీడియాకు రహస్యంగా చెప్పటం అమెరికాలో కుప్పకూలుతున్న వ్యవస్థలకు ఆనవాలు. సోవియెట్ కనుమరుగయ్యే ముందు కూడా ఇలాంటి ధోరణులే కనబడ్డాయి.ఇతర దేశాల సహకారంతో హార్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ట్రంప్ చెప్పిన కొన్ని గంటలకే, అందుకు తాము అంగీకరించబోమని నాటో భాగస్వామ్య దేశాలు బ్రిటన్, ఫ్రాన్స్‌లు ప్రకటించి గాలి తీశాయి. 'హార్మూజ్ దిగ్బంధం' అంటూ చేసిన ప్రకటనకు అర్థం ఇరాన్ నౌకాశ్రయాల దిగ్బంధమని అమెరికా సైన్యం ఆ వెంటనే తెలిపింది. సోమవారం నుంచి అమల్లోకి వచ్చిందని కూడా ప్రకటించారు. కానీ గల్ఫ్ దేశాలే దీన్ని నిరసిస్తున్నాయి. ట్రంప్ చర్య ఈ ప్రాంతం మొత్తాన్ని శాశ్వతంగా యుద్ధ ఊబిలోకి దించేస్తుందని సౌదీ అరేబియాతోసహా చాలా దేశాలు ఆందోళనపడుతున్నాయి. సౌదీ చమురు ఎగుమతులు యుద్ధానికి ముందు మాదిరే రోజుకు 70 లక్షల బ్యారెళ్లకు చేరు కున్నాయి. అవి ఎర్ర సముద్రం గుండా వెళ్తున్నాయి. కానీ అమెరికా దుందుడుకు చర్యకు దిగితే యెమెన్‌లోని హౌతీలు ఆ ఎగుమతుల్ని దెబ్బతీస్తారు. తన నాయకత్వాన ఇన్ని దశాబ్దాలుగా సాగిన ఏకధ్రువ ప్రపంచం కళ్లముందు కుప్పకూలుతున్న వైనాన్ని అమెరికా గ్రహించకపోతే పోయిందిగానీ... చైనా నాయకత్వంలో కొత్త అమరిక మొగ్గతొడుగుతోందన్న సంగతైనా అది తెలుసుకోవాలి. ఈ యుద్ధం తనకూ, ఇరాన్‌కూ మధ్య పంచాయతీ కాదు. అది పశ్చిమాసియాకు పరిమిత మైంది అంతకన్నా కాదు. ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని క్రమేపీ బలహీనపరుస్తున్న ఒక నిరర్థక యుద్ధం. అది చైనా నాయకత్వాన కొత్త కూటమికి పురుడు పోస్తున్న ప్రమాదకర యుద్ధం. ఆర్థికంగా, సైనికంగా ప్రపంచంలోనే తాము సర్వశక్తిమంతులమని ఇరాన్‌తో చర్చలకు చాన్నాళ్లముందు జేడీ వాన్స్ అన్నారు. ట్రంప్ ప్రభావం ఆయనపై ఎక్కువే ఉన్నట్టుంది. ఆ దృశ్యం మారుతున్న సంగతిని అమెరికా నాయకత్వం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

## నీటి భద్రత కోసం 'జలధార'

**మొదటిపేజీ తరువాయి** - చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. హంద్రీనీవా ద్వారా ఇప్పటివరకు 52 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, వంశధార నదిపై ప్రతిష్ఠాత్మకమైన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగినందున వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపుడిశెల ప్రాజెక్టు పనులనూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానానికి సంబంధించిన డీపీఆర్‌కు త్వరగా ఆమోదం పొందేలా చూడాలని సూచించారు.రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది 0.79 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించేందుకు త్వరగా టెండర్లు పిలవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో 38 లోక్‌సభ, 263 అసెంబ్లీ స్థానాలు


**మొదటిపేజీ తరువాయి** - అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి 263కు, లోక్‌సభ స్థానాల సంఖ్య 25 నుంచి 38కి పెరిగే అవకాశం ఉంది. 2023లో ఆమోదం పొందిన 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ చట్టం)ను 2029 ఎన్నికల నాటికి అమలు చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ సంస్కరణలను చేపట్టింది. ఈ బిల్లులు పార్లమెంటులో ఆమోదం పొందిన వెంటనే, నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది.ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, ఏపీలో 33 శాతం మహిళా రిజర్వేషన్ల ప్రకారం పెరిగిన అసెంబ్లీ స్థానాల్లో దాదాపు 87, లోక్‌సభ స్థానాల్లో 13 మహిళలకు కేటాయించబడతాయి. సీట్ల పెంపునకు అనుగుణంగా జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాల సంఖ్య కూడా పెరగనుంది.

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు



**మొదటిపేజీ తరువాయి** - శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది.వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# 24ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు



**మొదటిపేజీ తరువాయి** - బంగాల్‌లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తృణమూల్ కాంగ్రెస్ దోచుకున్న ప్రతి పైసాను వడ్డీతో సహా తిరిగి వసూలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. 24 ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నప్పటికీ, ఆయనపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉత్తర బంగాల్‌లోని జల్పాయ్‌గుడి జిల్లా రాజ్‌గంజ్‌లోని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికారం నుంచి వైదొలగడం ఖాయం. ఆ ప్రక్రియను ప్రారంభించే బాధ్యత ఇక్కడ నుంచే ప్రారంభమవుతుంది. ప్రధాని మోదీ గుజరాత్‌లో 12 ఏళ్లు పాలించారు. కేంద్రంలో మరో 12 ఏళ్లుగా నాయకత్వం వహిస్తున్నారు. అయినా సరే ఒక్క రూపాయి అవినీతి ఆరోపణ కూడా ఎదుర్కోలేదు. బంగాల్‌లో బీజేపీని అధికారంలోకి తీసుకురండి. టీఎంసీ నాయకులు ప్రజల నుంచి దొంగలించిన ప్రతి పైసాను, వడ్డీతో సహా మేం తిరిగి రాబడతాం" అని అమిత్ షా తెలిపారు.బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీచర్ల నియామక స్కాంలో రూ.300 కోట్లు, ఉత్తర బంగాల్ వరద సహాయ నిధుల్లో రూ.100 కోట్లు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హెచ్చరించారు. ఉత్తర బంగాల్ మూడు 'టీ'లతో (టీ, టింబర్, టూరిజం) ప్రసిద్ధి చెందిందని, కానీ సీఎం మమతా నాలుగో టీగా బీజేపీ కార్యకర్తల కన్నీళ్లను జోడించారని విమర్శించారు. ఉత్తర బంగాల్ అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. టీ తోట కార్మికులకు భూ హక్కులు కల్పించి వారిని భూస్వాములుగా మారుస్తామని వెల్లడించారు. టీఎంసీ గూండాలను గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం)లో కమలం గుర్తుపై ఓటు వేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు.ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, అప్పుడు బంగాల్ అంతటా ఎవరూ నాలుగు వివాహాలు చేసుకోలేరని అమిత్ షా తెలిపారు. తాము లవ్, ల్యాండ్ జిహాద్‌కు ముగింపు పలుకుతామని అన్నారు. అలాగే మహిళలకు ప్రతి నెలా రూ. 3 వేలు, నిరుద్యోగ యువతకు రూ. 3000 ఇస్తామని చెప్పారు. తల్లులు, సోదరీమణులు ప్రభుత్వ బస్సుల్లో టికెట్లు కొనాల్సిన అవసరం ఉండదు, వారు ఉచితంగా ప్రయాణించగలుగుతారని అన్నారు.అధికారంలోకి వచ్చిన వెంటనే డార్జిలింగ్‌లోని గూర్ఖాలాండ్ సమస్య పరిష్కారానికి రాజ్యాంగబద్ధంగా శాశ్వత పరిష్కారం చూపుతామని అమిత్ షా తెలిపారు. గతంలో జరిగిన హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో గుర్ఖా సోదరులపై వేల సంఖ్యలో తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని ఉపసంహరిస్తామని స్పష్టం చేశారు. గుర్ఖా సమస్య పరిష్కారం కోసం గతంలో ఢిల్లీలో నిర్వహించిన మూడు సమావేశాలకు మమతా హాజరు కాలేదని ఆరోపించారు. మధ్యవర్తిని నియమించినప్పటికీ ఆమె సహకరించలేదని విమర్శించారు. రాష్ట్రంలో చొరబాట్లు, గూండా రాజ్యం, మాఫియా వ్యవస్థకు ముగింపు పలుకుతామని పేర్కొన్నారు.బంగాల్‌లో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి దశ ఏప్రిల్ 23 కాగా, రెండో దశ 29న పోలింగ్ జరగనుంది. మే 24న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2021 బంగాల్ ఎన్నికల్లో టీఎంసీ 213 అసెంబ్లీ సీట్లు రాగా, బీజేపీకి 77 స్థానాల్లో గెలుపొందింది. ఈసారి ఎలాగైనా అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూసుస్తోంది. అటు టీఎంసీ కూడా అదే ప్రయత్నంలో ఉంది.

## భారత్‌లో తొలిసారి ముంబైలో పట్టాలెక్కనున్న నాన్ - ఏసీ క్లోజ్డ్ డోర్ లోకల్ రైలు





**మొదటిపేజీ తరువాయి** - ఉన్న లోకల్ రైలును ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. రద్దీగా ఉండే రైళ్ల నుంచి ప్రయాణికులు జారిపడి జరిగే ప్రమాదాలను నివారించడంతో పాటు తీవ్రమైన వేడి నుంచి ఉపశమనం కల్పించడం ఈ కొత్త రైలు రూపకల్పన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.ప్రస్తుతం ముంబైలో కేవలం ఖరీదైన ఏసీ లోకల్ రైళ్లకు మాత్రమే ఆటోమేటిక్ క్లోజ్డ్ డోర్ వ్యవస్థ ఉంది. అయితే, సాధారణ తరగతి ప్రయాణికులకు కూడా ఏసీ రైళ్ల తరహా భద్రతను తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో ఈ వినూత్న రైలును రూపొందించారు. ఇందులో ఏసీ లేనప్పటికీ, ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా 'ఫోర్స్డ్ వెంటిలేషన్ సిస్టమ్' అనే అధునాతన సాంకేతికతను అమర్చారు. ఈ వ్యవస్థ రైలు డోర్లు మూసి ఉన్నా కూడా కోచ్‌లలోకి నిరంతరం స్వచ్ఛమైన గాలిని పంపింగ్ చేస్తుంది. తద్వారా సాధారణ రైళ్ల కంటే ఎక్కువ గాలి ప్రసరణ జరిగి, లోపల వాతావరణం చల్లగా ఉంటుంది.ఈ సరికొత్త రైలు రేక్‌ను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో తయారు చేశారు. త్వరలోనే ముంబై సబర్బన్ ట్రాక్‌లపై దీని ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. ప్రయాణికుల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇందులో మరిన్ని ఆధునిక సదుపాయాలు కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో గార్డు లేదా మోటార్‌మ్యాన్‌తో మాట్లాడేందుకు 'టాక్-బ్యాక్' సిస్టమ్, మెరుగైన సీటింగ్ అమరిక, ఎల్‌ఈడీ లైటింగ్, రాబోయే స్టేషన్ల వివరాలను ప్రదర్శించే జీపీఎస్ ఆధారిత ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటివి ఇందులో ఉన్నాయి.ఈ రైలు టికెట్ ధరలపై ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఏసీ లోకల్ రైలు ఛార్జీల కంటే గణనీయంగా తక్కువగా, సాధారణ ఫస్ట్ క్లాస్ లేదా సెకండ్ క్లాస్ ధరలకు దగ్గరగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ట్రయల్స్ విజయవంతమైతే, ముంబై రైల్వే నెట్‌వర్క్‌ను ఆధునికీకరించే ప్రణాళికలో భాగంగా ఇలాంటి మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వే బోర్డు యోచిస్తోంది.

## ఏపీ ఇంటర్ ఫలితాల విడుదల,12 ఏళ్లలోఎన్నడూ లేనంతగా ఉత్తీర్ణత!




**మొదటిపేజీ తరువాయి** - ఆంధ్రప్రదేశ్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. గడిచిన 12 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది కూడా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు.ఈ ఏడాది సుమారు 10.50 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారని లోకేశ్ తెలిపారు. గత 12 ఏళ్లలో ఏన్నడూ లేనంతగా ఈ ఏడాది అత్యధిక శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఫస్టియర్లో 77 శాతం మంది విద్యార్థులు (3,61,526) పాసవ్వగా.. సెకండియర్లో 81 శాతం మంది విద్యార్థులు (3,59,816) ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. ఫస్టియర్లో బాలురు 72 శాతం, బాలికలు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్లో బాలురు 76 శాతం, బాలికలు 85 శాతం పాసయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో ఫస్టియర్ లో 61%, సెకండియర్ లో 74% మంది పాసయ్యారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా తొలి ఏడాది 54 శాతం మంది, ద్వితీయ సంవత్సరం 68 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని లోకేశ్ కితాబునిచ్చారు. ఇది విద్యార్థులు, ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్ల కష్టానికి ఫలితమని కొనియాడారు.

ఫలితాలను చెక్ చేసుకునే విధానం:

వెబ్‌సైట్: విద్యార్థులు resultsbie.ap.gov.inలో తమ హాల్ టికెట్ నంబర్ ద్వారా ఫలితాలు పొందవచ్చు.

వాట్సప్: 9552300009 నంబర్‌కు 'ఆఅ' అని మెసేజ్ పంపి, హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేస్తే నేరుగా రిజల్ట్ వాట్సప్‌కే వస్తుంది.


ఫలితాల విడుదల సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని, సప్లిమెంటరీ పరీక్షల్లో పట్టుదలతో చదివి పాస్ కావాలని సూచించారు. ఈ సమయంలో తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు మానసిక మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు.

# దక్షిణాదికి అన్యాయం జరిగితే తీవ్ర పోరాటం తప్పదు



**మొదటిపేజీ తరువాయి** - దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజనను అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లులను రేపటి నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లులు ఆమోదం పొందితే 2029 సాధారణ ఎన్నికల నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాలు సమూలంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించేలా ఈ ప్రక్రియ జరిగితే, అది దేశవ్యాప్త ప్రజా ఉద్యమానికి దారి తీస్తుందని ఆయన స్పష్టం చేశారు. జనాభా నియంత్రణ పాటించి, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న దక్షిణ రాష్ట్రాలకు ఈ పునర్విభజన శాపంగా మారకూడదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధిని ప్రోత్సహించాల్సింది పోయి, ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని మండిపడ్డారు.డీలిమిటేషన్ వల్ల దక్షిణాదికి సీట్లు తగ్గితే, అది కేవలం రాజకీయ ప్రక్రియగా మిగిలిపోదని... మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక తీవ్రమైన ప్రజా పోరాటానికి నాంది పలుకుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ గత మూడేళ్లుగా తీసుకున్న స్టాండ్‌కే కట్టుబడి ఉందని, ఇందులో ఎలాంటి మార్పు లేదని తెలిపారు.తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నామని పేర్కొంటూ... పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని అణచివేయాలని చూస్తే నిశ్శబ్దంగా ఉండబోమని హెచ్చరించారు. ఢిల్లీ పాలకులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని, దక్షిణాది ప్రజల హక్కుల విషయంలో బుద్ధిగా వ్యవహరించాలని ఆయన తన సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు.

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం



**మొదటిపేజీ తరువాయి** - పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్‌డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు



**మొదటిపేజీ తరువాయి** - రాజకీయాలపై వారి మధ్య చర్చ జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయానికి వస్తే మాత్రం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని అన్నారు.చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలుకుతారని తెలిపారు. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా బిల్లు ఉంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం సీట్లు ఉన్నాయని గుర్తు చేశారు. పునర్విభజన తర్వాత ఈ శాతం ఏమాత్రం తగ్గకూడదని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు.బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ తెలిపారు. అంతవరకు మనం తొందరపడకూడదని పార్టీ నాయకులకు సూచించారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభ, ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# చలివేంద్ర ఏర్పాటు



**నెల్లూరు టౌన్, ఏప్రిల్ 16, (సీమకిరణం న్యూస్) :** ప్రస్తుతం ఎండలు అధికంగా కొనసాగుతున్నాయని ఈ సమయంలో ప్రజలకు తాగునీరు అందించడం అత్యంత అవసరం అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా గ్రామీనాభివృద్ధి సంస్థ కార్యాలయ ఎదుట వేసవిని ద్రష్టిలో పెట్టుకొని చలివేద్రం ఏర్పాటు చేసిన డిఆర్డీఏ కు నా అభినందనలు. గురువారం చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. చలివేంద్రాలు ప్రజలకు తక్షణ ఉపశమనాన్ని కలిగిస్తాయన్నారు. వడదెబ్బకు ప్రజలు గురికాకుండా నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. వేసవి తీవ్ర దృష్ట్యా ప్రజలందరూ అత్యవసరమైతేనే బయటికి రావాలన్నారు. టోపీలు లేదా గొడుగులు దగ్గర ఉంచుకోవాలి. తమ వెంట తప్పనిసరిగా వాటర్ బాటిల్ ఉంచుకోవాలి. బస్ స్టేషన్లు, రద్దీ ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు ముందుకు వచ్చి మజ్జిగ అందిస్తూ చలివేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బోర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, అన్ని వాటర్ స్కీమ్స్ సక్రమంగా పనిచేసేలా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుకు పలువురికి చలివేద్రంలో ఏర్పాటు మజ్జిగను అందచేసారు. త్రాగునీటిని స్వయంగా గ్రాసులో పట్టుకొని త్రాగారు. ఈ కార్యక్రమములో డి.ఆర్.డి.ఎ పి.డి నాగ రాజ కుమారి, వారి సబ్బంది తదితరులు పాల్గొన్నారు.ర

# ఘనంగా పోషణ్ పక్వాడ




**నెల్లూరు టౌన్, ఏప్రిల్ 16, (సీమకిరణం న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు, నెల్లూరు జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నెల్లూరు పరిధిలో నిర్వహిస్తున్న 8వ "పోషణ్ పక్వాడా" కార్యక్రమంలో భాగంగా, ఈ రోజు పెద్దచెరుకూరు గ్రామంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నెల్లూరు సీడీపీఓ టి. అరుణ ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, నెల్లూరు నుండి పి. హరికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా "జీవితంలో మొదటి ఆరు ఏళ్లలో మెదడు అభివృద్ధిని పెంచడం" అనే ప్రధాన ఇతివృత్తంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల ఎదుగుదల మెదడు వికాసంలో కుటుంబ సభ్యుల, ముఖ్యంగా తండ్రుల పాత్రపై ప్రత్యేక అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను వివరించారు. తండ్రుల కోసం "సూపర్ డాడ్" కార్యక్రమం నిర్వహించారు. జంక్ ఫుడ్‌కు బదులుగా స్థానిక చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని ప్రోత్సహించారు. చిన్నారులకు ఆటల ద్వారా విద్య అందించే టోయ్-ఏ-థాన్ కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లల స్క్రీన్ టైమ్ తగ్గింపుపై తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వి. శకుంతల నవాబుపేట సూపర్‌వైజర్ , అంగన్ వాడి కార్యకర్తలు, సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా విజయవంతం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# డోన్ నుంచి నంద్యాలకు బస్సులను నడపండి

## డిపో మేనేజర్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం




**డోన్ టౌన్, ఏప్రిల్ 16,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణం నుంచి జిల్లా కేంద్రం నంద్యాలకు సరైన బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ బీజేపీ నాయకులు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ చలపతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డోన్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు నంద్యాలకు వెళ్లేందుకు తగిన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజూ డోన్ నుంచి నంద్యాలకు కనీసం 2 నుంచి 3 ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి బస్టాండ్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. డోన్ డిపోకు చెందిన ప్రతి బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రయాణికుల భద్రత కోసం జీపీఎస్ లైవ్ లోకేషన్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. అంతేకాకుండా డోన్ నుంచి శ్రీశైలం, బెంగళూరు వంటి ప్రాంతాలకు కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు బండి కిరణ్, జిల్లా ఐటీ కన్వీనర్ అరబోలు వీరేష్, పట్టణ ఉపాధ్యక్షులు దేవాదుల సుబ్రహ్మణ్యం, బి జె వై ఎమ్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, మాజీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు భరణి రమేష్, ఆర్ఎస్ఎస్ నాయకుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి నాయకుడు రాజశేఖర్ నాయుడు కు మాతృవియోగం

## పరామర్శించిన కోట్ల రాఘవేందర్ రెడ్డి

## వై.నాగేశ్వరరావు యాదవ్





**ప్యాపిలి ఏప్రిల్ 16 (సీమ కిరణం న్యూస్ ) :** మండల పరిధిలోని నల్ల మేకలపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు రాజశేఖర్ నాయుడు తల్లి సుబ్బమ్మ అనారోగ్య కారణాలతో మరణించారు. ఈ విషయాన్ని స్థానిక టిడిపి నాయకుల ద్వారా తెలుసుకున్న డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేందర్ రెడ్డి, కర్నూలు, నంద్యాల ఉభయ జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ లు గురువారం నల్ల మేకలపల్లి గ్రామానికి వెళ్లి రాజశేఖర్ నాయుడు తల్లి సుబ్బమ్మ పార్టీవదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి ని తెలిపారు. నివాళులర్పించిన వారిలో ప్యాపిలి మండల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, మైనారిటీ నాయకులు ఖాజా పీర్, కొంగనపల్లె మధు, రాంపురం నాగేశ్వరావు యాదవ్, సత్యం, నల్ల మేకలపల్లి నాగేశ్వరరావు, అశోక్ యాదవ్, బాల నరసింహులు, తదితరులు ఉన్నారు

# మున్సిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్ బదిలీ



**కర్నూలు ప్రతినిధి, ఏప్రిల్ 16, (సీమకిరణం న్యూస్):** కర్నూలు మున్సిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం జీవో నెంబర్ 414 జారీ చేసింది. ఆయన స్థానంలో చల్లా ఓబులేసును నియమించింది. కాగా గతేడాది జులై 11న కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.విశ్వనాథ్, 9 నెలల పాటు నగరానికి సేవలు అందించారు. నగర ప్రజల ఆశలకు, ఆకాంక్షలను అనుగుణంగా పనితీరు కనబరిచారు. పారిశుధ్యం, పచ్చదనం, మౌలిక సదుపాయాల కల్పన, వినూత్న కార్యక్రమాలతో అనతి కాలంలోనే నగర ప్రజల్లో మెప్పు పొందారు. నగరంలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రైవేటు స్థలాల్లో పదుల సంఖ్యలో జెసిబిలతో పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టడంతో పాటు గుత్తేదారులకు ఒకేసారి రూ. 18 కోట్లు, మరోసారి రూ.11 కోట్ల బిల్లులను చెల్లింపులు చేశారు. బుధవారపేట మెడికల్ కాలేజీ వద్ద మలుపు విస్తరణ వంటి దశాబ్దాల సమస్య పరిష్కారంలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర స్థాయి వార్తల్లో నిలిచారు. దామోదరం సంజీవయ్య కూడలి నుంచి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.30 కోట్లతో రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు క్రమశిక్షణలు తీసుకుని కొన్ని విభాగాలను ప్రక్షాళన చేశారు. అవినీతి నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తొలిసారి ఆర్వో, శానిటేషన్ ఇన్స్పెక్టర్లుగా మహిళలకు అవకాశం కల్పించారు. మున్సిపల్ కార్యాలయంలో ఫీడింగ్ రూం, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. పారిశుధ్యం, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి సారించారు. 'కర్నూలుకు హరితహారం' పేరుతో విడతల వారీగా 30 వేల మొక్కలు నాటించి గ్రీన్ సిటీకి నాంది పలికారు. అందులో ఒకేసారి 6 వేల మొక్కలను సచివాలయాల్లో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. గార్బేజ్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చెత్త వేయడంపై కఠిన చర్యలు చేపట్టారు. రాత్రివేళల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ప్రతి వీధి గోడలపై సిబ్బంది వివరాలు అందుబాటులో ఉంచి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచారు. యువత, విద్యార్థుల సహకారంతో విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్థిక వనరుల సమీకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఎల్ఆర్ఎస్, బిపియస్, పన్ను వసూళ్లను ప్రతిరోజూ సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించారు. విస్తరిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ఆదాయం సమకూర్చేందుకు చర్యలు చేపట్టారు. స్మార్ట్ సిటీ కింద పార్కులు, సెంట్రల్ మిడియన్స్ అభివృద్ధికి చొరవ చూపించారు. కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతన బిల్లులను ప్రతి నెల 20వ తేదీకే పంపేలా చర్యలు తీసుకున్నారు. గుత్తేదారులు, ఏజెన్సీల ద్వారా పనిచేసే కార్మికులకు నెలనెలా వేతనాలు అందేలా చూసారు. పారిశుద్ధ్య కార్మికుల కోసం రూ.82 లక్షలతో 21 రకాల పరికరాలు కొనుగోలు చేశారు. పండుగలు, ఉత్సవాల సందర్భాల్లో కార్మికులను ప్రోత్సహించారు. నగర అభివృద్ధిలో భాగంగా నూతన కార్యాలయ పనులను వేగవంతం చేసి తాత్కాలిక కార్యాలయాన్ని తరలించారు. కుక్కల బెడద నివారణకు తాత్కాలిక డాగ్ షెల్టర్ ఏర్పాటు చేసి సంతాన నిరోధక చికిత్సలను పెంచారు. నగర కూడళ్లలో బ్యానర్లు, పోస్టర్ల నిషేధాన్ని కఠినంగా అమలు చేశారు. కొత్త కూడళ్ల ఏర్పాటు, కుదింపు పనులు చేపట్టారు. ఈట్ స్ట్రీట్లు, వెండర్ జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. జగన్నాథ గుట్టపై టిడ్కో గృహాలను మరమ్మత్తులు పూర్తి చేసి వందలాది పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గృహాల కోసం డిడీలు కట్టిన వారికి తిరిగి చెల్లింపుల కోసం ప్రభుత్వంనుంచి నిధులు మంజూరు చేయించారు. భవన నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయంగా సేకరించే విధానాన్ని అమలు చేశారు. గడియారం ఆసుపత్రి అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారంతో చర్యలు చేపట్టారు. ప్రజలతో నేరుగా మమేకమయ్యే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్, ప్రతినెలా డయల్ యువర్ కమిషనర్, ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. వచ్చిన కొత్తలో సంతోష్ నగర్ వద్ద పైప్లాన్ లీకేజీ సమస్యను అత్యవసరంగా పరిష్కరించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా పక్కా ప్రణాళిక ద్వారా తాగునీటి సరఫరా చేశారు. నిపుణుల సహాయంతో చాకచక్యంగా లీకేజీలను సమర్థవంతంగా నివారించారు.

# గిరిజనుల అభ్యున్నతి ప్రతి ఒక్కరి బాధ్యత



**నెల్లూరు టౌన్, ఏప్రిల్ 16, (సీమకిరణం న్యూస్ ) :** గిరిజనుల అభ్యున్నతి ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్వేపల్లి శాసనసభ్యులు లు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన వెంకటాచలం మండలంలో కురిచెర్లపాడు పంచాయతీలోని నాలుగు ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలకు సంతోషిమాత ఆయిల్ కంపెనీ వారి సౌజన్యంతో బహూకరిస్తున్న క్రీడా పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి బిడ్డ బడికి వచ్చేలా చైతన్యం తేవాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, చేసిన కార్యక్రమాలకు రూ.46.5 కోట్ల సీఎస్ఆర్ నిధులు ప్రస్తుత ఆర్థిక ఏడాది మరిన్ని నిధుల కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. సీఎస్ఆర్ నిధులతో సహకరిస్తున్న ప్రతి కంపెనీకిఆయన ధన్యవాదములు తెలియజేశారు చిన్నారుల కోసం క్రికెట్, ఫుట్ బాల్, బ్యాడ్మింటన్ కిట్లు, స్కిప్పింగ్ రోప్స్, క్యారంబోర్డులు, చెస్ బోర్డులు, స్టోరీ బుక్స్, స్టేషనరీ, సీలింగ్ ఫ్యాన్లు, ప్రొజెక్టర్లు, ప్రింటర్ అందించిన సంతోషిమాత ఆయిల్ అండ్ ఫాట్స్ కంపెని కి ధన్యవాదాలు తెలియజే శారు గిరిజన కాలనీ చిన్నారులను అంగన్ వాడీ, స్కూళ్లకు వచ్చేలా సచివాలయ ఉద్యోగులు బాధ్యత తీసుకోవాలి చదువుకుంటే కలిగే ప్రయోజనాల విషయంలో గిరిజనుల్లో చైతన్యం తేవాలన్నారు పుస్తకాలు, దుస్తులతో పాటు మధ్యాహ్నభోజనం అందుతాయని, తల్లికి వందనం పథకంతో ఒక్కో బిడ్డకు రూ.13 వేలు చొప్పున సాయం అందుతుందని తెలియజేయాలన్నారు. వైసీపీ పాలనలో గిరిజనులకు ఆధార్ కార్డు ఇప్పించడంపైనా సచివాలయ ఉద్యోగులు దృష్టి పెట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల మందికి కొత్తగా ఆధార్ కార్డులు ఇప్పించామన్నారు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడమే కాదు..ప్రజల కష్టనష్టాలను తెలుసుకోవాలనే సామాజిక బాధ్యతతోనూ మెలగాలన్నారు. సమాజంలో మనతో సమానంగా పుట్టిన గిరిజనుల అభ్యున్నతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు గిరిజనులు, నిరుపేదల కోసం మనం పడుతున్న తాపత్రాయానికి సర్వేపల్లి నియోజకవర్గంలోని కంపెనీల సహకారం కలిసొస్తోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని 143 అంగన్ వాడీ కేంద్రాలకు సౌత్ ఇండియా కంపెనీ టీవీ, గ్యాస్ స్టౌవ్, కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్లు, కుర్చీలు తదితర వస్తువులను అందజేస్తోందన్నారు. సీఎస్ఆర్ నిధుల కోసం ప్రతి కంపెనీకి ప్రత్యేక వినతులు పంపుతున్నాం. సానుకూల స్పందన లభిస్తోందన్నారు. చిన్నారుల కోసం ఈ రోజు ఈ కార్యక్రమం చేపట్టిన సంతోషిమాత ఆయిల్ అండ్ ఫ్యాట్స్ కంపెనీకి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదం తక్షణమే అరికట్టండి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు టౌన్, ఏప్రిల్ 16, (సీమ కిరణం న్యూస్) :** రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రోడ్డు ప్రమాదాల నివారణా చర్యలను సత్వరమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక దృష్టిపెట్టాలని కమిటీలోని అధికారులకు సూచించారు. రాంగ్ రూట్ లో వచ్చే ప్రయాణికులపై కఠిన చర్యలు తీసుకొని, వాహనాలను సీజ్ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. గత సమావేశంలో చర్చించిన విధంగా జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ఎన్‌హెచ్ అధికారులు చాలావరకు నివారణ చర్యలు చేపట్టారని అభినందించారు. ఇంకా అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, రేడియం పెయింటింగ్ వేయాలని సూచించారు. నెల్లూరు- కృష్ణపట్నం రోడ్డు మార్గంలో స్పీడ్ బ్రేకర్లు, పనులు వేగంగా పూర్తి చేయాలి అన్నారు. అన్ని మార్గాల్లో కూడా విద్యుత్ లైట్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండు వద్ద లోపలికి వెళ్లేటప్పుడు, బయటకు వచ్చేటప్పుడు బస్సులు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారిపై వాహనాలు నిలపకుండా కృష్ణపట్నం పోర్టు రోడ్డు వద్ద ప్రస్తుతానికి వాహనాలు నిలుపుకోవాలని, త్వరలోనే ప్రభుత్వ భూమిని గుర్తించి వాహనాలు నిలిపేందుకు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెప్పారు. నెల్లూరు నగర పరిధిలోని మద్రాసు బస్టాండు, ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు మార్జిన్ ఆక్రమణలు లేకుండా వీధివ్యాపారులు ఎక్కువ సమయం ఉండకుండా ట్రాఫిక్ నివారణకు మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో గత మూడు నెలలుగా జరిగిన ప్రమాదాల తీరుతెన్నులు, నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధ్యయనం చేసి చాలా వివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఎస్పీ అజిత వేజెండ్ల, పోలీసు అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. గత మూడు నెలలుగా 98 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఈ ప్రమాదాలను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఎఎస్పీలు దీక్ష, సౌజన్య, మున్సిపల్ కమిషనర్ నందన్, ఆర్టీవో మదాని, ఎన్‌హెచ్ఎ పిడి ఎంకె చౌదరి, పోలీసుశాఖ అధికారులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ న్యూస్ లేబర్ కార్డు ఉన్న కార్మికులకు నాలుగు సంక్షేమ పథకాలు అమల్లోకి



**డోన్ టౌన్, ఏప్రిల్ 16, (సీమ కిరణం న్యూస్):** నంద్యాల జిల్లా డోన్ భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కార్మిక శాఖ ఆధ్వర్యంలో భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా నాలుగు ముఖ్య సంక్షేమ పథకాలను మార్చి 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నట్లు సహాయ కార్మిక శాఖ అధికారి బి. శోభారాణి తెలిపారు. సహాయ కార్మిక శాఖ కార్యాలయంలో మాట్లాడుతూ, ఈ పథకాల ద్వారా కార్మికుల కుటుంబాలకు అవసరమైన సమయాల్లో ఆర్థిక సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రసూతి, వివాహం, మరణం వంటి కీలక సందర్భాల్లో ఈ సాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

**ఈ పథకాల కింద అందించే ప్రయోజనాలు:**

**ప్రసూతి సహాయం** 20,000
**వివాహ కానుక** 20,000
**సహజ మరణం** 60,000
**దహన సంస్కరణల ఖర్చు** 20,000

సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్న లేబర్ కార్డు కలిగిన కార్మికులకే ఈ ప్రయోజనాలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ఇంకా నమోదు చేయని వారు వెంటనే నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదు చేసుకున్న వారు తమ కార్డులను సమయానికి రీన్యువల్ చేసుకోవాలని సూచించారు. అర్హులైన కార్మికులు ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకుని ఈ పథకాల ద్వారా లబ్ధి పొందాలని కోరారు. మరిన్ని వివరాల కోసం డోన్ పట్టణంలోని పాతపేటలో ఉన్న సహాయ కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

# డోన్ క్లబ్ హౌస్ లో మెప్మా సమీక్ష సమావేశం పథకాల అమలులో వేగం పెంచాలని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశం







**డోన్ టౌన్, ఏప్రిల్ 16,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న క్లబ్ హౌస్‌లో గురువారం మెప్మా ఆర్పీలు మరియు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నంద్యాల జిల్లా పీడీ వెంకట దాస్ మరియు డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలు, ప్రగతి నివేదికలు, అలాగే ఎదురవుతున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి పథకం లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు కావాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళా సంఘాలు, స్వయం ఉపాధి అవకాశాలు, మరియు పేదల ఆర్థికాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మెప్మా కార్యకలాపాలపై మాట్లాడుతూ, పట్టణ పేదల ఆర్థికాభివృద్ధి మరియు మహిళల సాధికారతలో మెప్మా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ వారి జీవనోపాధిని మెరుగుపరచడంలో సంస్థ చేస్తున్న సేవలను ప్రశంసించారు. అలాగే నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఉపాధి అవకాశాల కల్పన, బ్యాంకు లింకేజుల ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని ఆదేశించారు. పట్టణ పేదల జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావడం లక్ష్యంగా మెప్మా కార్యకలాపాలను మరింత విస్తరించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డోన్ లో షిరిడీ సాయిబాబా స్వామివారిని దర్శించుకున్నా జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా






**డోన్ టౌన్, ఏప్రిల్ 16,(సీమ కిరణం న్యూస్):** ఈరోజు గురువారం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా డోన్ పట్టణంలోని హైవే ప్రక్కల ఉన్నటువంటి శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయిబాబా మందిరం నందు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం యువ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి షిరిడీ సాయి బాబా కమిటీ సభ్యులు చాటకొండ శ్రీనివాసులు,కందుకూరి పార్థసారథి,ఆలా మల్లిఖార్జున రెడ్డి,కొండ సురేష్, ఈ.శ్రీరాములు మరియు తదితరులు ఆలయ మర్యాదలతో సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అదేవిధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# 17వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ప్యాపిలి ఏప్రిల్ 16 (సీమ కిరణం న్యూస్ ) :** నంద్యాలలో ఈనెల 17,18, 19 తేదీలలో జరిగే సిఐటియు రాష్ట్ర 17వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు నక్కిశ్రీకాంత్,పద్మశాలి శ్రీనివాసులు పిలుపునిచ్చారు.బుధవారం జలదుర్గం గ్రామములో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17వ రాష్ట్ర మహాసభలలో గత మూడు సంవత్సరాలలో సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన కార్మిక పోరాటాల జయాపజయాలపై సమీక్ష, రాబోవు మూడు సంవత్సరాలకు భవిష్యత్ కర్తవ్యాలు అదేవిధంగా కార్పొరేట్లకు అనుకూల లేబర్ కోడ్ ల అమలుతో కార్మిక వర్గానికి చీకటి రోజులు వచ్చాయని కార్మిక వర్గం మనుగడ సాగించాలంటే లేబర్ కోడ్ ల రద్దు తప్ప గత్యంతరం లేదని కావున లేబర్ కోడ్ ల రద్దు కొరకు భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ పై ముఖ్యంగా చర్చలు ఉంటాయని వారు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్ల అమలు పేరుతో ఇప్పటి వరకు ఉన్న కార్మిక చట్టాల రక్షణ కవచాన్ని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆయనకు వత్తాసు పలుకుతున్న నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు చిద్రం చేస్తున్నాయని ఎన్నో పోరాటాలు,ప్రాణ త్యాగాలతో కార్మిక వర్గం రక్తం చిందించి సాధించుకున్న కార్మిక హక్కులపై కార్పొరేట్లకు లాభాలను దోచిపెట్టడమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ కనుసన్నలలోని కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తున్నదన్నారు.ఇది యూనియన్ల ఏర్పాటుకు



అడ్డంకులు,సమ్మె హక్కుపై ఆంక్షలు,8 గంటల పని విధానాన్ని తుంగలో తొక్కడం పని గంటల పెంపు,శాశ్వత ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్టు,గిగ్ పనులు,భద్రతా చర్యలకు తూట్లు పొడవడం తదితర చర్యలతో తెచ్చిన లేబర్ కోడ్ లు దేశ వ్యాప్తంగా కార్మికుల జీవితాలకు ప్రమాద ఘంటికలు మోగించబోతున్నాయి అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడినాడాలని లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని,పాత కార్మిక చట్టాలనే అమలు చేయాలని,విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని,గ్రామీణ పేదల ఉపాధి హక్కును దిగమింగిన కేంద్రం తీరు గర్హనీయమని మహాత్మా గాంధీ పేరుని తొలగించడం హేయమైన చర్య అని దానిని యథాతతంగా పునరుద్ధరించాలని,8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని,కనీస వేతనం 26,000 ఇవ్వాలని,స్కీం వర్కర్లను కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని,రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని,సిపిఎస్ రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని,విశాఖ ఉక్కు సహా ప్రభుత్వ సంస్థల విక్రయాలను ఆపాలని డిమాండ్ చేశారు.కార్పొరేటు-మతతత్వ కూటమి ప్రభుత్వాలు సాగిస్తున్న కార్మిక ప్రజా కంటక పాలనకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యోగులు ఉపాధ్యాయులు రైతులు వ్యవసాయ కార్మికులతో సహా సమస్త శ్రమజీవులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రతాప్, మధు, సుధాకర్,రామకృష్ణ, మహబూబ్ బాషా, నాగేశ్వరరావు, రాజేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కంటి సమస్యలపై ప్రజలకు అవగాహన అవసరం






## చిన్నపిల్లలను సెల్ ఫోన్ కు దూరంగా ఉంచాలి

## పిల్లల్లో కంటి చూపు సమస్యలకు సెల్ ఫోన్లే కారణం

## ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు ( ఆప్తాల్మాలజిస్ట్) డాక్టర్ లక్ష్మీ ప్రసన్న

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

**వెల్దుర్తి , ఏప్రిల్ 16, (సీమకిరణం న్యూస్):** దేశంలో కంటి సమస్యల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కంటి సమస్యలపై ప్రజలకు అవగాహన అవసరమని ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు ( ఆప్తాల్మాలజిస్ట్) డాక్టర్ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు కొరపోలు నాగేంద్ర ప్రసాద్ తల్లిదండ్రులు నారాయణ శర్మ, అన్నపూర్ణమ్మ కొరపోలు వారి సహాయ సహకారాలతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూలు జిల్లాలో మంచి పేరున్న కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ లక్ష్మీ ప్రసన్న వెల్దుర్తి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన దాదాపు 100 మంది ప్రజలకు ఉచితంగా కంటి వైద్యం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ కంటి సమస్యలు ముఖ్యంగా వయసు పెరుగుతున్న అందరికీ వస్తాయని కనుక రెగ్యులర్గా కళ్ళను కంటి వైద్యులతో చెకప్ చేయించుకోవాలని కోరారు. ఎంతోమంది పెద్దలకు కంటి శుక్లాలు కంటి పొరలు ఏర్పడి నిర్లక్ష్యంతో అవి ముదిరిపోయి శాశ్వతంగా అంధత్వం వచ్చే ప్రమాదం ఉందని అందువలన వైద్య సహాయాన్ని పెద్దలు వెంటనే అందిపుచ్చుకోవాలని కోరారు.ఇప్పుడు ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నారని వాటిని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీమతి స్వయంప్రభ మాట్లాడుతు సెల్ఫోన్ల వాడకంతో నేటి యువతరం సర్వేంద్రియం నయనం ప్రధానం అంతటి గొప్ప కళ్ళను చేతులారా కంటి చూపును నాశనం చేసుకుంటున్నారని రాత్రి నిదురను పక్కన పెట్టి సెల్ ఫోన్ లో గంటలు గంటలు గడుపుతు కళ్ళను ప్రమాదంలో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటకు మించి సెల్ఫోన్లను చూడవద్దని కోరారు. పిల్లలకు మంచి పోషక విలువలను ఆహారాన్ని అందించినప్పుడు కంటిచూపు మెరుగ్గా ఉండి చదువులో రాణించగలరని చదువులో వెనుక పడుతుంటే వెంటనే కంటి పరీక్షలను నిర్వహించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసన్నను, హిందీ పండిట్ స్వయంప్రభను హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ తరపున శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమానికి సహకరించిన కొరపోలు నాగేంద్రప్రసాదును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంత హిందీ పండిట్ శ్రీమతి స్వయంప్రభ, వైద్య సహాయకులు దిలీప్ ,హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరి సింహానాయుడు, వైద్యం రామానాయుడు, సత్యం, ప్రతాప్, క్రికెటర్ శ్రీకాంత్, రమణ డాక్టర్ పోతులూరి ఆచారి, స్వాములు, లాయర్ గిరిబాబు, మహేష్, కురువ రామకృష్ణ, శాంతి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు శుభాకాంక్షలు

**వెల్దుర్తి,ఏప్రిల్ 16, (సీమకిరణం న్యూస్) :** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన యువ నాయకులు, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కు వెల్దుర్తి మండల టిడిపి అధ్యక్షులు టిఈ. బలరాం గౌడ్, వెల్దుర్తి సొసైటీ అధ్యక్షులు బొమ్మన రమాకాంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కర్నూలు జిల్లా నుంచి తెలుగుదేశం పార్టీ జోనల్ కోఆర్డినేటర్ గా నియమితులైన ఎమ్మెల్సీ బీ.టీ. నాయుడు కి, పత్తికొండ నియోజక వర్గం నుంచి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా నియమితులైన తుగ్గలి నాగేంద్ర కు శుభాకాంక్షలు తెలిపారు.

# వైసిపి జిల్లా యువజన వింగ్ కమిటీ కార్యదర్శిగా పోతిరెడ్డి రజినికాంత్ రెడ్డి



**ప్యాపిలి ఏప్రిల్ 16 (సీమ కిరణం న్యూస్ ) :** నంద్యాల జిల్లా వైయస్సార్సీపి యువజన విభాగం వింగ్ కమిటీ కార్యదర్శిగా ప్యాపిలి పట్టణానికి చెందిన పోతిరెడ్డి రజనీకాంత్ రెడ్డి నియమితులయ్యారు. గురువారం వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయం నుండి నియామక పత్రాలు అందుకున్న పోతిరెడ్డి రజనీకాంత్ రెడ్డి పత్రిక ముఖంగా తెలిపారు. ఈ సందర్భంగా రజనీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన వైసిపి చీఫ్ జగన్మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. రజనీకాంత్ రెడ్డికి మండల వ్యాప్తంగా వైఎస్ఆర్సిపి నాయకులు అభినందనలు తెలియజేశారు.

# డోన్ మండలంలో వాటర్ షెడ్ ప్రాజెక్టు పరిశీలన చేసిన కలెక్టర్ ర్రాజకుమారి గణియా






**డోన్ టౌన్, ఏప్రిల్ 16,(సీమ కిరణం న్యూస్):** డోన్ మండలం ఉంగరానిగుండ్ల గ్రామంలోని ఎద్దుపెంట వాటర్షెడ్ ప్రాజెక్టు అమలు తీరును జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు కింద జరుగుతున్న పనుల పురోగతిని ఆమె సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా నిర్వహిస్తున్న 100 రోజుల 'జలధార' కార్యక్రమంలో భాగంగా అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫిషరీస్ శాఖల అధికారులకు 'రిడ్జ్ టు వ్యాలీ' (Ridge to Valley) రైట్ టు వాలి కాన్సెప్ట్పై అవగాహన కల్పించారు. భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి సమర్థ వినియోగం, సాగునీటి మెరుగుదల కోసం ఈ విధానం ఎంతో ఉపయోగకరమని ఆమె పేర్కొన్నారు.ప్రాజెక్టు అమలులో సమన్వయం పెంచి, గ్రామ స్థాయిలో రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# వెల్దుర్తి విధి విక్రయ వ్యాపారస్తు లకు సుంకం రద్దు చేయాలి : ఏఐటీయూసీ





**వెల్దుర్తి, ఏప్రిల్ 16, (సీమకిరణం న్యూస్):** వెల్దుర్తి విధి విక్రయ వ్యాపారస్తు లకు సుంకం రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మరియు ఎంపిడిఓ కి వినతి పత్రం సమర్పించారు. ఏఐటియుసి అనుబంధ సంఘం చిన్న వ్యాపారస్తులు సంగం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె రామాంజనేయులు ఆధ్వర్యంలో గురువారం పాత బస్టాండ్ సర్కిల్ నుండి వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ వరకు ర్యాలీగా బయలుదేరి గ్రామపంచాయతీ కార్యదర్శి వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా వెల్దుర్తి ఎం పి డి ఓ కి వినతి పత్రం సమర్పించారు. సిపిఐ మండల కార్యదర్శి టీ కృష్ణ ఏఐటియుసి మండల కార్యదర్శి మాధవస్వామి మాట్లాడుతూ వెల్దుర్తి పట్టణ నందు సుమారు 600 కుటుంబాలు వీధి వీధి తిరిగి వ్యాపారాలు చేస్తూ జీవనోపాధి చేస్తున్నాయి. ప్రస్తుతం నిత్యవసర ధరలు పెరగడం వ్యాపారాలు అంతంత మాత్రమే ఉన్నాయి పన్ను కట్టలేని పరిస్థితి ఏర్పడింది ఉన్నతాధికారులు మా పరిస్థితిని తెలుసుకొని చిన్న వ్యాపారస్తులకు సుంకం రద్దు చేయాలని అదేవిధంగా కొత్తగా టెండర్లు పాడినవారు వ్యాపారస్తులు తో ప్రభుత్వం నిర్ణయించిన సుంకం మాత్రమే వసూలు చేయాలి. విధి విక్రయసంఘం మండల ప్రధాన కార్యదర్శి కే అనిల్ కుమార్ సిపిఐ పట్టణ కార్యదర్శి గిరి మాట్లాడుతూ వెల్దుర్తి పట్టణంలో పాత బస్టాండ్ కొత్త బస్టాండ్ వీధి వీధి తిరుగుతూ పూలు పండ్లు కూరగాయలు వివిధ వ్యాపారసం చేస్తూ వెల్దుర్తిలో చాలామంది జీవనం సాగిస్తున్నారు ఆదివారం సంత మార్కెట్లో తాగునీరు వీధిలైట్లు చిన్నపాటి వర్షం వస్తే ఇబ్బందులు ఉన్నాయి కాబట్టి వ్యాపరుస్తులకు ఇబ్బంది లేకుండా వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సిపిఐ మండల నాయకులు వెంకటేశ్వర్లు చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు బషీర్ భాష సుధాకర్ వెంకటేష్ రమణమ్మ, కృష్ణవేణమ్మ , చిరు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు

# వెల్దుర్తిలో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ



**వెల్దుర్తి, ఏప్రిల్ 16, (సీమకిరణం న్యూస్) :** స్థానిక పట్టణంలో ఉన్న వెల్దుర్తి మండల కేంద్రంలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ హెచ్ఎం కె.చంద్రావతి,అధ్యక్షత వహించడం జరిగింది. అదేవిధంగా గురువారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, విగ్రహాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు,అలాగే వెల్దుర్తి మండల మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడ్,చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ మరియు మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది, విజయలక్ష్మి,రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్,లు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఈ ప్రజాస్వామ్యానికి బలమైన పునాది మన రాజ్యాంగం,యొక్క ఆత్మ గౌరవంన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు.అలాగే సమానత్వం,స్వేచ్ఛ, న్యాయం.మన రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు డా.బి.ఆర్. అంబేద్కర్,ఒక గొప్ప సందేశం ఇచ్చారు రాజ్యాంగం ఎంత గొప్పదైనా,దాన్ని అమలు చేసే వాళ్లు మంచివాళ్లు అని అంబేద్కర్ తెలిపారు అని వారు తెలియజేశారు .అంతే కాకుండా ప్రతి ఒక్కరూ ఉన్నత విద్య ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఇలాంటి గొప్ప మహనియులను మనం ఎప్పటికీ మరువకూడదని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ దాది పోగు రాజేష్,బాలక్రిష్ణ నాయక్,జయన్న,సుగురు వెంకటేశ్వర్లు,బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్, (యుటిఎఫ్) నాయకులు, ఉపాధ్యాయులు,మరియు విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com